- అమలు కాని పథకాలు
- తల్లికి వందనం లేదు
- విద్యా, వసతి దీవెన అంతంతమాత్రమే..
- గత ప్రభుత్వంలో నాడు – నేడులో చక్కటి భవనాలు

పేదల చదువుకు కూటమి గ్రహణం

సర్వేపల్లి నియోజకవర్గంలో..

తల్లికివందనం అర్హులు	: 29,205 మంది
విద్యాదీవెనకు	: 15,378 మంది
వసతి దీవెనకు	: 14,097 మంది

గత ప్రభుత్వంలో జమచేసిన నగదు

అమ్మఒడి	: 119.05 కోట్లు
విద్యా దీవెన	: 50.34 కోట్లు
వసతి దీవెన	: 83.27 కోట్లు
విద్యార్థులకు ట్యాబ్‌లు	: 2,142



పొదలకూరు జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం

పొదలకూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిచ్చింది. ప్రధానంగా మనబడి నాడు – నేడు పథకం ప్రవేశపెట్టి బడుల రూపురేఖలు మార్చేసింది. ఆధునాతన భవనాలను నిర్మించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పరిస్థితులు మారిపోయాయి. విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్త చేస్తున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలను పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయలేకపోతోంది. ఉన్నత చదువులకు సంబంధించి విద్యా దీవెన కింద ఫీజులను ఇప్పటి వరకు చెల్లించకపోవడంతో ఉత్తీర్ణులై బయటకు వచ్చిన వారు సర్టిఫికెట్లను తెచ్చుకోలేకున్నారు. ఈ నేపథ్యంలో ఇటీవల వైఎస్సార్‌సీపీ పిలుపు మేరకు ఫీజు ధర్నాను కూడా నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటి వరకు ఒక్కసారే ఫీజులను జమ చేయడం జరిగింది. పాత బకాయిలు అలాగే ఉన్నాయని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేసేందుకు ససేమిరా అంటున్నారు. పాఠశాల విద్య నుంచి ఇంటర్మీడియట్ వరకు తల్లికి వందనం పేరుతో ఎందరు పిల్లలుంటే అందరికీ రూ.15 వేలు వంతున నగదు ఇస్తామని ఎన్నికల సమయంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదు.

నాడు – నేడు ఇలా..

సర్వేపల్లి నియోజకవర్గంలో నాడు – నేడు పథకం కింద గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శిథిలావస్థలో ఉన్న జెడ్పీ, ప్రాథమిక పాఠశాలలను పునరుద్ధరించింది. ఇందుకోసం రెండు విడతలుగా రూ.కోట్లు నిధులను వెచ్చించి కార్పొరేట్‌ను తలదన్నేలా తీర్చిదిద్దింది. 422 పాఠశాలలుండగా దాదాపు 80 శాతం వాటిని సర్వాంగ సుందరంగా మార్చారు. నేడు అసంపూర్తి భవనాలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసింది. 2,142 మంది 8వ తరగతి విద్యార్థులకు జగన్ ప్రభుత్వం ట్యాబ్‌లను అందజేసి బైజూస్ కంటెంట్‌తో వారిని ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేసింది. ఇప్పుడు బడులు తెరుచుకున్న తర్వాత కూడా పుస్తకాలను పూర్తి స్థాయిలో అందజేయడం లేదనే విమర్శలున్నాయి.

జమ కాని ఫీజులు

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్నా ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఫీజులు సక్రమంగా జమ కాలేదు. ముఖ్యంగా ఇంజినీరింగ్ చదువుతున్న వారు ఫీజులు జమకాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో విద్యా దీవెన కింద 15,378 మంది అర్హులున్నారు. వీరిలో చివరి ఏడాది పూర్తి చేసుకుని బయటకు వచ్చే వారి పరిస్థితి ఘోరంగా ఉంది. బకాయిలున్న ఫీజులను చెల్లించకుంటే విద్యార్థులకు కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లను అందజేయడం లేదు. కొందరైతే అప్పులు చేసి మరీ ఫీజులు చెల్లించి సర్టిఫికెట్లను తీసుకెళ్తున్నారు.



నాడు - నేడులో బాగుపడిన ముత్తుకూరు మండలం పంటపాళెం ప్రాథమిక పాఠశాల

తల్లికి వందనం కోసం ఎదురుచూపులు



తల్లికి వందనం పథకం కోసం ఎదరు చూస్తున్నాం. గతేడాతే పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు. తర్వాత ఈ ఏడాది నగదు జమ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు అమలు చేసింది లేదు. ఎప్పుడు పథకాన్ని అమలు చేస్తారో స్పష్టత లేకుండా పోయింది.

– వై.పద్మ, గృహిణి, మొగళ్లూరు

ఫీజులు చెల్లించాలి



ఫీజుల చెల్లించలేక చాలామంది విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. చివరి ఏడాది చదువు పూర్తి చేసుకున్న వారు బకాయిలు పడిన ఫీజులను అప్పులు చేసి చెల్లించాల్సి వస్తోంది. వెంటనే ప్రభుత్వం స్పందించాలి.

– కె.ప్రసాద్‌రెడ్డి, పొదలకూరు

కోవూరు నియోజకవర్గంలో..



అసంపూర్తిగా వదిలేసిన కోవూరు జేబీఆర్ ప్రభుత్వ పాఠశాల

కోవూరు: వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం నాడు–నేడు పనులతో పాఠశాలల రూపురేఖలు మార్చింది. ప్రస్తుత కూటమి నాయకులే ఆయా పాఠశాలలను సందర్శించిన సమయంలో మెచ్చుకున్న సందర్భాలు ఉన్నాయి. నాలుగేళ్లలో కోవూరు మండలంలో నాడు–నేడు ద్వారా 32 పనులు మంజూరు కాగా 18 పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు కూటమి ప్రభుత్వంలో నిలిచిపోయాయి. అలాగే బుచ్చిరెడ్డిపాళెంలో 40 పాఠశాలలకు 11కు మాత్రమే పనులు పూర్తయ్యాయి. విడవలూరులో 39 పాఠశాలలకు సంబంధించి 31 స్కూల్స్‌లో అన్ని పనులు జరిగాయి.

నాలుగేళ్లలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలలు, కళాశాలలకు తప్పని సరిగా వచ్చి చదువుకునేలా, అందుకు తల్లులు ప్రత్యేక శ్రద్ధ చూపేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకాన్ని అమలు చేశారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏటా రూ.15 వేల చొప్పున తల్లుల ఖాతాలో నగదు జమచేశారు. జిల్లాలో నాలుగేళ్లలో ఈ పథకం ద్వారా 11,17,154 మంది విద్యార్థుల తల్లులకు రూ.1675.7 కోట్ల లబ్ధిచేకూరింది. కూటమి ప్రభుత్వం వచ్చాక మే నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తాం.. రూ.15 వేల చొప్పున ఇస్తామని ప్రకటించారు. అయితే నేటికీ అమలు కాలేదు.

తల్లికి వందనానికి సంబంధించి అర్హులు

కోవూరు	5,681
కొడవలూరు	5,685
విడవలూరు	6206
బుచ్చిరెడ్డిపాళెం	9,600
ఇందుకూరుపేట	6,200
మొత్తం	33,372

నమ్మించి గొంతు కోశారు

మా ఇంట్లో ఒకరు నాలుగో తరగతి, మరొకరు రెండో తరగతి చదువుతున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు ఇంట్లో ఎంత మంది బిడ్డలు పాఠశాలకు వెళ్తున్నారో అందరికీ ఏడాది రూ.15 వేల చొప్పున ఇవ్వాలి. చంద్రబాబు చెప్పిన మాట ప్రకారం మా ఇద్దరి బిడ్డలకు రూ.30 వేలు రావాల్సి ఉంది. అయితే ఇంతవరకు ఎలాంటి డబ్బులు జమ కాలేదు. సీఎం చంద్రబాబు ఇచ్చిన మాటను తప్పి మాలాంటి నిరుపేదల గొంతు కోయడం మంచి పద్ధతి కాదు.

– లక్ష్మి, కోవూరు

రూ.30 వేలు రావాలి



నాకు ఇద్దరు బిడ్డలున్నారు. వీరిని ప్రభుత్వ పాఠశాలకు పంపుతున్నాను. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు రూ.15 వేలు చొప్పున ఇస్తామన్నారు. ఆయన మాట ప్రకారం రూ.30 వేలు రావాలి.

– స్వాతి, పడుగుపాడు

క్లుప్తంగా

డాక్టరేట్ ప్రదానం



దిలీప్‌కుమార్

వెంకటాచలం: విక్రమ సింహపురి యూనివర్సిటీ (వీఎస్‌యూ) దిలీప్‌కుమార్‌కు డాక్టరేట్ ప్రదానం చేసింది. వర్సిటీ కావలి కళాశాల పరిశోధక విద్యార్థి అయిన దిలీప్‌కుమార్ కామర్స్ విభాగ అధ్యాపకుడు పి.వెంకట్రావు పర్యవేక్షణలో నెల్లూరు జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు మూల్యాంకనం అనే అంశంపై పరిశోధనను విజయవంతంగా పూర్తి చేశాడు. డాక్టరేట్ పొందిన దిలీప్‌కుమార్‌ను వీసీ అల్లం శ్రీనివాసరావు, వీఎస్‌యూ కావలి, నెల్లూరు కళాశాలల ప్రిన్సిపల్స్ సీహెచ్ శ్రీనివాసరావు, విజయ తదితరులు అభినందించారు.

యోగాపై అవగాహన



యోగా చేస్తున్న గ్రామస్తులు

మనుబోలు: యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని బద్దెవోలు గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎంపీడీఓ జలజాక్షి మాట్లాడుతూ రోజూ కొద్దిసేపు యోగా చేయడం వల్ల ఒత్తిడి దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో మడమనూరు ఆయుర్వేద డాక్టర్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల ఎలక్ట్రిక్ కాటాల పరిశీలన



ఎలక్ట్రిక్ కాటాలు

పొదలకూరు: ఎండీయూ వాహనాలను తొలగించి పాత పద్ధతిలో రేషన్ డీలర్ల ద్వారా సరుకులను పంపిణీ చేయనున్నారు. దీనికి సంబంధించి ఎలక్ట్రిక్ కాటాలను తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం పరిశీలించారు. స్థానిక రైతు బజార్ వద్ద మండలంలోని 59 మంది డీలర్లను రప్పించి కాటాలకు సీల్ వేశారు. బిజన్ టెక్ కంపెనీ వారు కాటాల్లో తేడాలున్నా, బ్యాటరీలు, ఇతర సామగ్రి లేకపోయినా మరమ్మతులు చేసి డీలర్లకు అందజేస్తామని వెల్లడించారు.

హోంగార్డు మృతికి సంతాపం

పొదలకూరు: పొదలకూరు పోలీస్‌స్టేషన్లో హోంగార్డుగా పనిచేస్తున్న చీకోలు వెంకటప్రసాద్ (59) గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందాడు. మండలంలోని మరుపూరు గ్రామంలో ఆయన నివాసం ఉంటున్నాడు. వెంకటప్రసాద్ పట్టణంలో ట్రాఫిక్ విధులను నిర్వహిస్తూ అందరికీ సుపరిచితుడు. సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై హనీఫ్ శుక్రవారం సంతాపం తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై విచారణ జరపాలి

- తాటిపర్తిపాళెం గ్రామస్తుల డిమాండ్

వెంకటాచలం: తాటిపర్తిపాళెం గ్రామంలో ప్రభుత్వ నిధులతో టీడీపీ నాయకుల సొంత పొలాల వద్దకు చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణంపై జిల్లా అధికారులు సమగ్ర విచారణ జరపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. రోడ్డు నిర్మాణానికి ఉపాధి హామీ పథకం కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. అయితే ప్రజలకు ఉపయోగపడే వీధుల్లో కాకుండా తమ పొలాల వద్దకు వెళ్లేందుకు వీలుగా నిర్మాణ పనులను టీడీపీ నాయకుడు పూర్తి చేయించాడు. దీంతో గ్రామస్తులు కలెక్టర్, పంచాయతీరాజ్, ఎంపీడీఓ తదితర శాఖల అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అసలు రోడ్డు నిర్మాణ పనులకు సంబంధించి గ్రామ పంచాయతీ తీర్మానం లేదని వారు చెబుతున్నారు. వాస్తవాలపై విచారణ జరిపి ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



పొలాల మధ్యలో నిర్మించిన సీసీ రోడ్డు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వెంకటాచలం: ఎదురుగా వస్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీని టమాటా లోడుతో వెళ్తున్న బడా దోస్త్ వాహనం ఢీకొని ఇద్దరు గాయపడిన ఘటన మండలంలోని కాకుటూరు సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు వైపు నుంచి గూడూరు వైపు ఆయిల్ ట్యాంకర్ లారీ వెళ్తోంది. గొలగమూడి క్రాస్ రోడ్డు వద్ద నుంచి రాంగ్ రూట్‌లో టమాటో లోడుతో వెళ్తున్న బడా దోస్త్ వాహనం అదుపుతప్పి ట్యాంకర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ క్లీనర్ శ్రీనాథ్, దోస్త్ వాహనం నడుపుతున్న డ్రైవర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వారిని చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. లారీ ముందు భాగం దెబ్బతినగా, దోస్త్‌లో ఉన్న టమాటాలు నేలపాలయ్యాయి. జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరగడంతో గూడూరు వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నేలపాలైన టమాటాలు

కాకాణి అరెస్ట్ అన్యాయం



పూజితారెడ్డితో మాట్లాడుతున్న బట్టేపాటి, పర్వతరెడ్డి

ఇందుకూరుపేట: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అరెస్ట్ అన్యాయమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి అన్నారు. ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి కాకాణి కుమార్తె పూజితారెడ్డిని నెల్లూరులోని వారి నివాసంలో శుక్రవారం కలిసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన కాకాణి అరెస్టు తీరును తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దారుణ ఘటనలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు.

బంగారు భవితకు ఉపాధ్యాయుల తూట్లు

ఇందుకూరుపేట: ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా పదో తరగతి పరీక్షల జవాబుపత్రాలను దిద్దడం వల్ల ఓ బాలిక బంగారు భవితకు తూట్లు పడాయి. మండలంలోని పల్లిపాడు ప్రభుత్వ హైస్కూల్లో చింతపంటి మేఘన అనే విద్యార్థినికి పదో తరగతి ఫలితాల్లో మొదటిగా 559 మార్కులు వచ్చాయి. గతంలో సోషల్ సబ్జెక్ట్‌లో 78 మార్కులు రాగా రీవాల్యుయేషన్‌లో 17 పెరిగి మొత్తం 95 మార్కులొచ్చాయి. దీంతో 576 మార్కులతో స్కూల్లో ద్వితీయ స్థానం సాధించింది. కాగా ఆ బాలిక ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోగా గతంలో వచ్చిన మార్కులతో సీటు కష్టతరమైంది. అయితే ప్రస్తుతం వచ్చిన మార్కులతో ట్రిపుల్ ఐటీకి సీటు వచ్చే అవకాశం ఉందని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. తాజా మార్కులతో దరఖాస్తు చేసుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పించాలని బాలిక తల్లిదండ్రులు ఆదినారాయణ, మాధవి కోరారు.


BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2025
REVERIFICATION / RECOUNTING OF MARKS
Subject: ... Social Studies
There is "Change" in your marks from 78 to 95.

బాలికకు రెండోసారి వచ్చిన మార్కులు

సీపీఎం నేతల ర్యాలీ



కొడవలూరు: సమైక్యత యాత్రలో భాగంగా మండలంలోని నార్తురాజుపాళెంలో సీపీఎం మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గోనె దయాకర్, సీఐటీయూ నాయకులు తలారి నరసింహం, దేవానంద్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆహార ప్యాకెట్ల అందజేత



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలోని మదర్‌హోం అనాథాశ్రమంలో బుచ్చిరెడ్డిపాళెం టౌన్ వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి పత్రి పెంచల లక్ష్మీతేజ ఆధ్వర్యంలో వృద్ధులు, విద్యార్థులకు ఆహార ప్యాకెట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తల్లి చవాన్ కృష్ణవేణి 26వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలో ఉన్న వారికి ఆహార ప్యాకెట్లు అందించడం సంతోషంగా ఉందన్నారు. రిటైర్డ్ హోమియో ఆఫీసర్ ఠాగూర్‌నాథరావు, మనోజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

5న సహకార పెట్రోల్ బంక్ ప్రారంభం

కోవూరు: పడుగుపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో ఇనమడుగు గ్రామంలో పెట్రోల్ బంక్‌ను జూన్ 5న ప్రారంభిస్తున్నట్లు డీసీఓ గురప్ప తెలిపారు. ఆయన ఇనమడుగు గ్రామంలో జరుగుతున్న బంక్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సొసైటీకి సంబంధించిన స్థలంలో పెట్రోల్ బంక్ పనులు వేగంగా సాగుతున్నాయన్నారు.

సకాలంలో సరుకులివ్వాలి



కొడవలూరులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్

కోవూరు/ఇందుకూరుపేట: రేషన్ కార్డుదారులకు సకాలంలో సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దార్ నిర్మలానంద బాబా కోరారు. కోవూరు మండలంలోని 15 చౌక దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అలాగే ఇందుకూరుపేట మండలంలోని రేషన్ దుకాణాలను తహసీల్దార్ కృష్ణప్రసాద్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సరుకుల నిల్వలను పరిశీలించారు. సమయపాలన తప్పక పాటిస్తూ లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని సూచించారు.

⇨ కొడవలూరు: స్థానిక ఒకటో నంబర్ రేషన్ దుకాణాన్ని తహసీల్దార్ కె.స్ఫూర్తిరెడ్డి శుక్రవారం పరిశీలించారు. యంత్ర సామగ్రి పనితీరుపై ఆరాతీశారు. ఆమె వెంట వీఆర్వో శ్రీనివాసులు ఉన్నారు.

స్వల్పకాలిక వరి రకాలను వేసుకోండి

కొడవలూరు: ఎడగారులో స్వల్పకాలిక వరి రకాలను వేసుకోవాలని వ్యవసాయ పరిశోధనా స్థానం హెడ్ వినీత రైతులకు సూచించారు. మండలంలోని కమ్మపాళెం రైతు సేవా కేంద్రంలో నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులతో శుక్రవారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులను ఇబ్బడిముబ్బడిగా వాడకుండా ఉండడం ఎడగారులో ప్రధానమన్నారు. తొలి పంటలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి మరలా ఎడగారులోనూ వాడడం వల్ల పంటలో రసాయన అవశేషాల పరిమితి పెరుగుతోందన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ జి.లక్ష్మీమాధవి మాట్లాడుతూ పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువులు పొలంలో చల్లడం ద్వారా రసాయన ఎరువుల వినియోగం తగ్గించుకోవాలని చెప్పారు. లింగాకర్షక బుట్టలు, జీవన ఎరువులు, జీవశిలీంద్రాలు వాడడం ద్వారా తెగుళ్లు, పురుగులను నియంత్రించుకోవాలని సూచించారు. కేవీకే శాస్త్రవేత్త ఆర్.సుజాత, ఏఓ లక్ష్మి, ఏఈఓ వెంకట్రావు, వీఏఏ సుజిత్, ఎంపీటీసీ పేరకం అరుణకుమారి, సర్పంచ్ చౌటూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

అనువైన పంటలు ఎంచుకోవాలి

విడవలూరు: మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌కు అనువైన పంటలను ఎంచుకోవాలని జిల్లా విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ లోకేశ్‌బాబు కోరారు. మండలంలోని చౌకచర్ల గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం వారి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో రకాలు వాటి ఎంపిక విషయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని, పోషక లోపాల విషయంలో శాస్త్రవేత్తల సూచనల ప్రకారం ఎరువులు వాడాలని సూచించారు. అదే విధంగా యువత వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీలక్ష్మి, వ్యవసాయాధికారులు శైలజ కుమారి, వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోరి వికాసం



మనుబోలు : పోస్టర్ల ప్రదర్శన



పొదలకూరు: పోస్టర్ల విడుదల

మనుబోలు: మండలంలోని వెంకన్నపాళెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమణమ్మ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, బాల్య వివాహాలు, బాలికా సంరక్షణ చట్టాలు తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఐరన్, విటమిన్ సీ లభించే ఆహార పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు ముత్యాలమ్మ, రమణమ్మ, ఆశా సునీత తదితరులు పాల్గొన్నారు.

⇨ పొదలకూరు: కిశోరి బాలికలు సోషల్ మీడియాతో జాగ్రత్తగా వ్యవహరించాలని వెంకటాచలం సీడీపీఓ విజయలక్ష్మి సూచించారు. కిశోరి వికాసం – వేసవి శిక్షణలో భాగంగా మండలంలోని దుగ్గుంటరాజుపాళెంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై సీడీపీఓ మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి, కల్పన, భారతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

⇨ తాటిపర్తి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సీహెచ్ ఆదినారాయణమ్మ సమావేశం నిర్వహించారు. సుధారాణి, లక్ష్మీకాంతమ్మ, బేబీ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కొడవలూరు: పాతవంగల్లులో..

⇨ కొడవలూరు: నగదు పొదుపు ఎంతో అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.పద్మావతి సూచించారు. కిశోరి వికాసం వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా మండలంలోని పాతవంగల్లులో ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డబ్బు ఒక సాధనం మాత్రమేనని, లక్ష్యం కాదన్నారు. ఆశా కార్యకర్త కె.మునీంద్రకుమారి, అంగన్‌వాడీ కార్యకర్త ఎం.అరుణకుమారి, హెల్పర్ యు.వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు

కోవూరు: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగులకు మెరుగైన సేవలు అందించేలా వైద్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ పరిమళ అన్నారు. కోవూరులోని సీహెచ్‌సీని ఆమె శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రోగులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వైద్యారోగ్య సిబ్బందికి కేటాయించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు.

వంద పడకల ఆస్పత్రిగా..

కోవూరు సీహెచ్‌సీని వంద పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు అన్ని సౌకర్యాలు ఇక్కడ ఉన్నాయని డాక్టర్ పరిమళ తెలిపారు. అందుకు సంబంధించి రిపోర్ట్ కూడా ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ లీలావతి, వైద్యులు వెంకట చలపతిగౌడ్, సలావుద్దీన్, సిబ్బంది పాల్గొన్నారు.



వసతులను పరిశీలిస్తున్న డాక్టర్ పరిమళ